
సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలో బీఆర్‌ఎస్‌లో చేరిన శివకుమార్‌కు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

బీజేపీ-కాంగ్రెస్ చీకటి ఒప్పందం

- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో బట్టబయలు
- కేసీఆర్‌ను ఓడించేందుకు ఢిల్లీ స్థాయిలో కుట్రలు
- కాంగ్రెస్ పార్టీకి బీ టీమ్‌లా బీజేపీ
- రైతుబంధును ఆపాలన్న కాంగ్రెస్‌కు రైతులు గుణపాఠం చెప్పాలి
- కర్ణాటక రైతుల గోస మన రైతులకు రావొద్దు
- ఎన్ని కుట్రలు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరే : మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బిడ్డ సీఎం కేసీఆర్‌ను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీలో చేతులు కలిపాయని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రాజీనామాతో ఆ రెండు పార్టీల చీకటి ఒప్పందం బట్టబయలైందని అన్నారు. తెలంగాణపై విషం కక్కే కాంగ్రెస్, బీజేపీ ఒకవైపు ఉంటే, తెలంగాణ ప్రజల గురించి నిరంతరం ఆలోచించే కేసీఆర్ మరోవైపు ఉన్నారని తెలిపారు. తెలంగాణ కోసం కష్టపడుతున్న కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావటం ఖాయమని స్పష్టంచేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, ఎద్దుమైలారంలో మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. సదాశివపేటలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మనబిన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముఖీమ్ తన మద్దతుదారులతో కలిసి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సంగారెడ్డిలో మైనార్టీ నాయకులు పెద్దసంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎద్దుమైలారంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శివకుమార్ తన మద్దతుదారులతో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీపై ఫైర్ అయ్యారు.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే

కాషాయ పార్టీకి కాంగ్రెస్‌కు ఉన్న బంధం రాజగోపాల్ రాజీనామాతో బట్టబలైందని హరీశ్‌రావు అన్నారు. 'కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి వేర్వేరు పార్టీల్లో ఉండి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నా కాంగ్రెస్, బీజేపీ వారిపై చర్యలు తీసుకోలేదు. దుబ్బాక, హుజూర్‌నగర్, మునుగోడులో మూడు ఉప ఎన్నికలు జరిగితే ఎక్కడా కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. కాంగ్రెస్ అంతర్గతంగా బీజేపీకి సహకరించటం వల్లే డిపాజిట్ రాలేదు. నాటి సహకారానికి కృతజ్ఞతగా బీజేపీ ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తున్నది. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి రోజూ రాత్రి మాట్లాడుకుని తమ పార్టీల ఎజెండాలను ఫిక్స్ చేసుకుంటున్నారు. రేపోమాపో కొంత మంది బీజేపీ నేతలను కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి పంపే పనిలో ఉన్నారు. కాంగ్రెస్‌కు బీజేపీ బీటీమ్‌గా మారింది. కేసీఆర్‌ను తట్టుకోలేక కాంగ్రెస్, బీజేపీ చీకట్లో చేతులు కలుపుతున్నాయి. కేసీఆర్ వ్యక్తి కాదు.. ఒక శక్తి. కేసీఆర్‌ను ఓడించటం ఎవరి తరమూ కాదు. విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ ఒకవైపు ఉంటే, విషం నింపుకున్న నాయకులు కాంగ్రెస్, బీజేపీలో ఉన్నారు' అని ధ్వజమెత్తారు.

సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరటం ఖాయం

సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరటం ఖాయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి ప్రజలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి ఏనాడూ ప్రజలకు అందుబాటులో ఉండలేదని, కరోనా కష్టకాలంలో కూడా హైదరాబాద్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలవకున్నా చింతా ప్రభాకర్ కరోనా సమయంలో జనం వెన్నంటి ఉన్నారని, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ మాణిక్యం, బీఆర్‌ఎస్ నేతలు మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక రైతుల గోస తెలంగాణ రైతులకు వద్దు

కర్ణాటకలో రైతులు కాంగ్రెస్‌ను నమ్మి గెలిపించి ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని, కర్ణాటక రైతుల గోస తెలంగాణ రైతులకు రావద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కర్ణాటక రైతులు కొడంగల్, గద్వాలకు వచ్చి తమ కష్టాలు చెప్తున్నారని తెలిపారు. తెలంగాణలో కేసీఆర్ వల్ల వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా అవుతున్ననట్టు పేర్కొన్నారు. కరెంటు ఇవ్వని కాంగ్రెస్‌ను నమ్మవద్దని, రైతులకు అండగా ఉన్న కేసీఆర్ వెన్నంటే ప్రజలు, రైతులు ఉండాలని కోరారు. రైతుబంధు డబ్బులు వేయవద్దంటున్న కాంగ్రెస్ పార్టీకి రైతులు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం కుర్చీకోసం కొట్లాట జరుగుతుందని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, జానారెడ్డి.. ఇలా ఎవరికి వారే సీఎం అవుతానని చెప్తున్నారని, వారికి సీఎం కుర్చీ కొట్లాట తప్ప జనం గురించి పట్టదని విమర్శించారు.

భయపడాల్సింది ఏమీ లేదు

- బరాజ్‌లలో సాంకేతిక సమస్యలు సాధారణ విషయమే
- పిల్లర్ కుంగుబాటు స్వల్పమే
- కేంద్రానికి త్వరలో నివేదిక
- పూర్తి అధ్యయనం తర్వాతే పునరుద్ధరణ చర్యలు
- రాష్ట్ర ఇరిగేషన్ అధికారులతో భేటీలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల స్పష్టీకరణ
- బరాజ్ డిజైన్లు, నిర్మాణంలపై చర్చ

బుధవారం జలసౌధలో రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, రామగుండం ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఈఎన్సీ నాగేందర్‌రావు, ఎల్‌అండ్‌టీ సంస్థ అధికారులతో సమావేశమైన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల నిర్మాణంలో చిన్న చిన్న సాంకేతిక సమస్యలు సహజమేనని, మేడిగడ్డ (లక్ష్మీ బరాజ్) 7వ బ్లాకులోని 20వ పియర్ కుంగుబాటుపై అంతగా ఆందోళన చెందాల్సింది ఏమీ లేదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్ నేతృత్వంలోని అధికార బృందం స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. కేంద్ర జల్‌శక్తి శాఖ నియమించిన ఈ బృందం ఇప్పటికే లక్ష్మీ బరాజ్‌ను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించింది. అనిల్‌జైన్‌తోపాటు ఈ బృందంలో సభ్యులుగా ఉన్న కే శర్మ, ఆర్ తంగమణి, రాహుల్ కే సింగ్, దేవేందర్‌రావు, కేజీబీవో నామినేట్ చేసిన ఇద్దరు సభ్యులు బుధవారం జలసౌధలో రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, రామగుండం ఈఎన్సీ వెంకటేశ్వర్లు, ఈఎన్సీ నాగేందర్‌రావుతోపాటు, ఈ బరాజ్‌ను నిర్మించిన ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బరాజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలన్నింటినీ వివరంగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి ముందు చేపట్టిన పరీక్షలను, నిర్మాణం చేసిన విధానం, అందుకు వినియోగించిన యంత్ర పరికరాలకు సంబంధించిన అంశాలపైనా ఆరా తీయడంతోపాటు ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరింత సాంకేతిక సమాచారాన్ని కోరినట్టు సమాచారం. వాటన్నింటినీ క్రోడీకరించి కేంద్ర జల్‌శక్తి శాఖకు ప్రాథమిక నివేదిక అందిస్తామని ఈ బృందం వెల్లడించినట్టు తెలుస్తున్నది. నీటి ప్రవాహం తగ్గాక బరాజ్ పునాది స్థాయిలో మరిన్ని పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నదని, ఆ తర్వాత పునరుద్ధరణ పనులకు తగిన సిఫారసులు చేస్తామని తెలిపినట్టు సమాచారం.

కుంగుబాటు స్వల్పమే..

లక్ష్మీ బరాజ్ పరిస్థితిపై మీడియా వస్తున్న కథనాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు పొంతనే లేదని విస్మయాన్ని వ్యక్తం చేసిన కేంద్ర బృందం.. ప్రాజెక్టుల నిర్మాణాల్లో చిన్న చిన్న సాంకేతిక సమస్యలు సహజమేనని పేర్కొనడంతోపాటు గతంలో పలు ప్రాజెక్టుల్లో తలెత్తిన సమస్యలను ఉదహరించినట్టు తెలుస్తున్నది. వాటితో పోల్చినప్పుడు ప్రస్తుతం లక్ష్మీ బరాజ్ కుంగుబాటు స్వల్పమేనని, అది కూడా ఒకవైపు మాత్రమేనని అభిప్రాయపడినట్టు అధికారులు చర్చించుకుంటున్నారు.

నిర్మాణంలో ఎలాంటి లోపాల్లేవు

- పునాదిలో ఇసుక కోత వల్లే 20వ పిల్లర్ స్వల్ప కుంగుబాటు
- నిపుణులు నిర్ధారించింది ఇదే
- ప్రవాహం తగ్గగానే పునరుద్ధరణ
- ఈఎన్సీ మురళీధర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): లక్ష్మీ బరాజ్ నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేవని తెలంగాణ సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ స్పష్టం చేశారు. పునాదిలో ఇసుక కోత వల్లే 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ స్వల్పంగా కుంగుబాటుకు గురైందని, అది కూడా ఒకవైపు (రివర్ అప్‌స్ట్రీమ్ వైపు) మాత్రమేనని తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందంతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్ష్మీ బరాజ్ నిర్మాణానికి ముందు ఎల్‌అండ్‌టీ ఇంజినీర్లు, ఇరిగేషన్ అధికారులు అన్ని రకాల పరీక్షలు, పరిశీలనలు చేశారని, సంబంధిత నివేదికల ఆధారంగానే నిర్మాణ పనులను చేపట్టారని వివరించారు. డిజైన్‌లో, నిర్మాణ నాణ్యతలో లోపాలేమీ లేవని చెప్పారు. ఇంజినీరింగ్ అధికారులు కూడా ప్రాథమికంగా ఇదే నిర్ధారణకు వచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం పియర్స్ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించి, క్షేత్రస్థాయిలో బరాజ్ పునాదిని పరిశీలించనున్నట్టు చెప్పారు. అధ్యయన ఫలితాలతోపాటు కేంద్ర కమిటీ సిఫారసుల మేరకు పునరుద్ధరణ పనులు చేపడతామని వివరించారు. గోదావరిలో ప్రవాహాలు తగ్గుముఖం పట్టాక నవంబర్‌లో పునరుద్ధరణ పనులు చేపట్టి, వేసవిలోగా పూర్తిచేసేందుకు ఎల్‌అండ్‌టీతో కలిసి కసరత్తు చేస్తున్నామని, సొంతంగా చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ ఇప్పటికే సంసిద్ధత తెలిపిందని పేర్కొన్నారు. లక్ష్మీ బరాజ్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ కమిటీకి అందజేశామనారు., వారు కోరిన అదనపు సమాచారాన్ని త్వరలో అందజేస్తామని చెప్పారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షం

- బీఆర్‌ఎస్ గెలుపునకు పార్టీ శ్రేణులు కష్టపడాలి
- ప్రతిపక్ష నాయకుల 'మేడిగడ్డ' రాజకీయం తగదు
- నల్లగొండలో మీడియాతో మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్‌తోనే సుభిక్షంగా ఉంటుందని, ముచ్చటగా మూడోసారి కేసీఆరే సీఎం అవుతారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుత్తా మాట్లాడారు. తొమ్మిదిన్నరేండ్లల్లో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, ఇలా ఏ రంగం తీసుకున్నా తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని చెప్పారు. రాజకీయాల కోసం ఎవరెన్ని మాట్లాడినా.. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌నే విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12కు 12 స్థానాల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని, రాష్ట్రంలోనూ కేసీఆర్ సర్కార్‌దే గెలుపని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ పార్టీలోనైనా చిన్న సమస్యలు సర్వసాధారణమని, కూర్చుని చర్చించుకుని, అందరూ సమన్వయంతో బీఆర్‌ఎస్ విజయం కోసం పనిచేయాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న తన అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, మిత్రులంతా బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకు పార్టీ మారాల్సిన అవసరం లేదని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే తాను గానీ, తన కుమారుడు అమిత్‌రెడ్డి గానీ పోటీకి సిద్ధమని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ ఘటనను రాజకీయం చేయడం తగదని ప్రతిపక్షాలకు హెచ్చరించారు. కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు తలెత్తడం సహజమని, గతంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయని గుత్తా సుఖేందర్‌రెడ్డి గుర్తు చేశారు.

మూడోసారీ కేసీఆరే సీఎం!

- బీసీలపై సీఎం కేసీఆర్‌ది మానవీయ దృక్పథం
- కాంగ్రెస్‌లో బీసీలను అణగదొక్కుతున్నారు
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్‌ఎస్ నేత, మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న తెలంగాణకు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం పక్కా అని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేత దాసోజు శ్రవణ్‌తో కలిసి బుధవారం మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో పలు విషయాలు పంచుకున్నారు. బీసీ వర్గాలపై సీఎం కేసీఆర్‌కు మొదటి నుంచి మానవీయ దృక్పథం ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇప్పుడు మాట్లాడుతున్న కులగణనను సీఎం కేసీఆర్ ఎప్పుడో పూర్తిచేశారని తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు అసాధ్యం

1983 నుంచి ఇప్పటి వరకు గడిచిన నలభై ఏండ్లలో చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి లాంటి నాయకుల కాలంలోనూ కాంగ్రెస్‌కు తెలంగాణలోని మొత్తం సీట్లలో 50 శాతం ఎన్నడూ రాలేదని పొన్నాల గుర్తు చేశారు. అలాంటిది ఇప్పుడు ఆ పార్టీ 50శాతానికిపైగా సీట్లతో ఎలా గెలుస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచీ బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. గతంలో పీసీసీ చీఫ్‌లుగా పనిచేసిన ముగ్గురు బీసీ నేతలు ఎందుకు రాజీనామా చేశారని ప్రశ్నించారు. బీసీలకు అనేక పదవులు ఇచ్చి సముచిత ప్రాధాన్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు బీసీలకు న్యాయం చేస్తున్న కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని, ఇందులో అనుమానం లేదని పొన్నాల స్పష్టం చేశారు.

సిరిసిల్లలో అద్భుత ప్రగతి

- జర్మనీ జీఎస్‌ఈ సంస్థ చైర్మన్ థామస్ ప్రశంసలు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 25: 'సిరిసిల్ల స్మార్ట్ సిటీని తలపిస్తున్నది.. పదేండ్లలోనే అద్భుత ప్రగతి సాధించింది.. సీఎం కేసీఆర్ సహకారం, మంత్రి కేటీఆర్ చొరవతోనే ఇదంతా సాధ్యమైంది.' అంటూ జర్మనీకి చెందిన జీఎస్‌ఈ సంస్థ చైర్మన్ థామస్ ప్రశంసల వర్షం కురిపించారు. స్టడీ టూర్‌లో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వచ్చిన జీఎస్‌ఈ బృందానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ బుధవారం తన నివాసంలో తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ సంస్థ స్టడీ టూర్‌లో భాగంగా రెండేండ్లకోసారి సిరిసిల్లలో పర్యటిస్తున్నామని తెలిపారు. పట్టణంలో తక్కువ సమయంలో ఇంత అభివృద్ధి జరగడం గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం బతుకమ్మ, దసరా పండుగల విశిష్టతను జీఎస్‌ఈ బృందానికి జిందం కళ వివరించారు. మంత్రి కేటీఆర్ తమ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీవై నగర్ చర్చి ఫాదర్ శ్యాంకల్యాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, దూస శ్రీకాంత్ పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతో జీఎస్‌ఈ సంస్థ(జర్మనీ) చైర్మన్ థామస్ బృందం

గవర్నర్ హోదాలో రాజకీయాలా?

- తమిళిసై వ్యాఖ్యలపై తమిళనాడులో డీఎంకే, ప్రతిపక్ష నేతల విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి డిప్యూటీ గవర్నర్ హోదాలో ఉన్న తమిళిసై సౌందర్‌రాజన్ రాజకీయాలు చేయడంపై తమిళనాట డీఎంకే, ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. ఆమె బీజేపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు తప్ప గవర్నర్‌గా పనిచేయడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు. అందుకు తాజా వ్యాఖ్యలనే ఉదాహరణగా పేర్కొన్నారు. దాదాపు 25 ఏండ్లు బీజేపీలో కొనసాగిన తమిళనాడు సినీనటి గౌతమి ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన ఆస్తిని కాజేయాలని చూస్తున్న వ్యక్తికి బీజేపీ సీనియర్ నేతలు అండగా నిలిచారని, కష్టకాలంలో తనకు బీజేపీ నేతలు అండగా నిలవకుండా, తనను మోసం చేసిన వ్యక్తికే మద్దతు ఇస్తున్నారని, 2021లోనూ పార్టీ టికెట్ ఇస్తామని చెప్పి చివరకు మోసం చేశారని, ఇక బీజేపీలో కొనసాగేది లేదని అందుకే రాజీనామా చేస్తున్నానని గౌతమి ప్రకటించిన విషయం తెలిసిందే. స్థానిక మీడియా ప్రతినిధులు ఇదే విషయాన్ని గవర్నర్ తమిళిసై వద్ద ప్రస్తావించగా పాత్రికేయులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు జరిగిన అన్యాయాన్ని సినీనటి గౌతమి తనతో చెప్పి ఉంటే ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా పరిష్కరించేందుకు సహాయం అందించే దానిని పేర్కొన్నారు. తమిళిసై స్పందించిన తీరుపై అక్కడి విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. గవర్నర్ హోదాలో రాజకీయాలు చేయడమేమిటని నిలదీస్తున్నాయి.

తిరుమల అన్నప్రసాదం ఖర్చు 38 లక్షలు

- ఒకరోజు వితరణ విరాళాన్ని ప్రకటించిన టీటీడీ
- పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో నిర్ణయం



హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో తిరుమలలో ఒకరోజు పూర్తి అన్నప్రసాద వితరణ కోసం రూ.38 లక్షలు విరాళంగా టీటీడీ నిర్ణయించింది. ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళం ఇప్పటివరకు రూ.33 లక్షలు ఉండగా, అదనంగా మరో ఐదు లక్షలు పెంచింది. ఉదయం అల్పాహారం కోసం రూ.8 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.15 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.15 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. విరాళం అందించే దాత పేరు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తారు. నిత్యం అన్నప్రసాదాల తయారీకి రోజుకు 14 నుంచి 16.5 టన్నుల బియ్యం, 6.5 నుంచి 7.5 టన్నుల కూరగాయలను వినియోగిస్తున్నారు.

ప్రముఖ పద్యకవి

జీవీ కృష్ణమూర్తి కన్నుమూత

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 25 : ప్రముఖ పద్యకవి, కీర్తి పురస్కార గ్రహీత జీవీ కృష్ణమూర్తి (75) బుధవారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కరీంనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణారావు, డాక్టర్ తత్వాది ప్రమోద్‌కుమార్, రామక విశలశర్మ, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ వారాల ఆనంద్, డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, బొద్దుల లక్ష్మయ్య, సముద్రాల వేణుగోపాల ఆచార్య, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజోజ నాగభూషణం, కేఎస్ నంతాచార్య, మాడిశెట్టి గోపాల్, దబ్బెట రాజా రామ్మోహన్ శర్మ, కేబీ శర్మ తదితరులు జీవీ కృష్ణమూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. సాయంత్రం జీవీ కృష్ణమూర్తి అంత్యక్రియలు పూర్తిచేశారు.

రూ.38 కోట్లు వైట్‌మనీయే!

- ఇప్పటివరకు 53.93 కోట్లు స్వాధీనం
- 1.76 కోట్ల నగదుకే రశీదులు లేవు
- మరో 14 కోట్ల నగదుపైనా విచారణ
- బంగారు ఆభరణాలకూ క్లీన్ చిట్
- ఐటీ డీజీ సంజయ్ బహదూర్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల తాయిలాలను అడ్డుకునేందుకు జరుపుతున్న సోదాల్లో భాగంగా ఈ నెల 9 నుంచి 25 వరకు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ రూ.53.93 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నది. ఇందులో సరైన పత్రాలు లేని రూ.1.76 కోట్లతోపాటు తమ సొంత ఇంటెలిజెన్స్ ద్వారా పట్టుకున్న రూ.14.80 కోట్ల నగదుపై విచారణ జరుపుతున్నామని ఆ శాఖ డీజీ సంజయ్ బహదూర్ బుధవారం మీడియాకు వెల్లడించారు. రశీదులున్న మిగిలిన రూ.38.17 కోట్ల నగదును సదరు యజమానులకు తిరిగి ఇచ్చినట్టు తెలిపారు. సోదాల్లో పట్టుబడిన 156 కిలోల బంగారు ఆభరణాలు, 454 కిలోల వెండికి సరైన రశీదులు చూపడంతో వాటికి కూడా క్లీన్‌చిట్ ఇచ్చినట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఐటీ శాఖ కూడా రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నదని, ఇందులో భాగంగా 33 జిల్లాల్లో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, ఎయిర్‌పోర్ట్ ఇంటెలిజెన్స్ టీమ్‌ల ద్వారా సుమారు 250 మంది సిబ్బందిని మోహరించామని వివరించారు. ఒక్క హైదరాబాద్‌లోనే 150 మందిని మోహరించామని, వీరంతా నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు పట్టుబడితే ఐటీ శాఖ పరిధిలోకి తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎక్కడైనా అనుమానస్పదంగా లావాదేవీలు జరిగినా, డబ్బులు అక్రమంగా చేతులు మారుతున్నా టోల్ ఫ్రీ నంబర్ 18004251785, ల్యాండ్‌లైన్ నంబర్ 040-23426201/23426202, వాట్సాప్ నంబర్ 7013711399 లేదా cleantelanganaelections@incometax.gov.in ఈ-మెయిల్‌కు సమాచారం ఇవ్వాలని సంజయ్ బహదూర్ కోరారు.

340 కోట్ల సొత్తు స్వాధీనం

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈనెల 9 నుంచి 25 వరకు సుమారు రూ.340.11 కోట్ల విలువైన సొత్తును తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. మంగళవారం ఒక్కరోజే రూ.4.44 కోట్ల విలువైన సొత్తు పట్టుబడింది. బుధవారం వరకు రూ.119 కోట్ల పట్టుబడింది. రూ.18.67 కోట్ల విలువైన మద్యం, రూ.16.94 కోట్ల విలువైన గంజాయి, రూ.156 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.28.91 కోట్ల విలువైన ఇతర ఎన్నికల ప్రభావిత వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

21 వేలు దాటిన ఎన్నికల ఫిర్యాదులు

- 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు 20,022
- సీ విజిల్ యాప్‌కు 1,290 మాత్రమే
- మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ నుంచే అత్యధికం

హైదరాబాద్, అక్టోబరు 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఇప్పటి వరకు వివిధ అంశాలపై ఎన్నికల సంఘానికి రాష్ట్రవ్యాప్తంగా 21,312 ఫిర్యాదులు అందాయి. ఎన్నికల సమస్యల పరిష్కారానికి ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు అత్యధికంగా 20,022 ఫిర్యాదులు అందగా, సీ విజిల్ యాప్‌కు అతి తక్కువగా 1,290 ఫిర్యాదులే వచ్చాయి. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల నుంచే అత్యధికంగా 11,732 ఫిర్యాదులు రావడం విశేషం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 4,217, రంగారెడ్డి 3,953, హైదరాబాద్ జిల్లా నుంచి 3,562 ఫిర్యాదులు అందాయి. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన వాటిలో 19,762 ఫిర్యాదులను ఎన్నికల సంఘం అధికారులు పరిష్కరించారు. సీ విజిల్ యాప్‌కు ఎక్కువగా అనుమతి లేకుండా పోస్టర్లు వేశారని, బ్యానర్లు కట్టారని ఫిర్యాదులు అందాయి. నగదు, మద్యం పంపిణీ చేస్తున్నారని, బహుమతులు ఇస్తున్నారని కూడా ఎక్కువగానే అందాయి. ఎన్నికల నియామవళికి విరుద్ధంగా మైకులు, లౌడ్ స్పీకర్లు వాడుతున్నారని, అనుమతి లేకుండా కాన్వాయ్ వాడుతున్నారనీ ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 21 మినహా మిగతా వాటన్నంటినీ పరిష్కరించి, బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే 1.40 గంటల్లో సమస్యను పరిష్కరిస్తారు.

567 దరఖాస్తుల తిరస్కరణ

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి వివిధ రకాల అనుమతుల కోసం 2,512 దరఖాస్తులు ఎన్నికల సంఘానికి అందాయి. 567 మంది దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. వాటిలో అత్యధికంగా వాహనాల అనుమతుల కోసం వచ్చినవే ఉన్నాయి. ఇవే 200కు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ర్యాలీ నిర్వహణకు అనుమతి, సభలు, సమావేశాలకు మైక్, లౌడ్ స్పీకర్ల అనుమతి వంటి వాటినే అధికారులు ఎక్కువగా తిరస్కరించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

RAJA BAHADUR VENKATA RAMA REDDY INSTITUTE OF TECHNOLOGY (RBVRRIT)
ICET Code: RBVR
Approved by AICTE & Affiliated to O.U
4-1-878 to 881 Hanuman Tekdi, Abids, Hyderabad-1.
Tel. No.040-24752118, 9908973330, 9491879533, 9949539609
Admission Notification to "B" Category Seats in

Course	Intake	Convenor	B-Category
MCA	120	84	36
MBA	120	84	36

Sri T.Mohan Reddy, Secretary cum Correspondent